

పరువు నష్టం కేసులో నగరి కోర్టుకు 'బండారు'


నగరి కోర్టు ఆవరణంలో బండారు సత్యనారాయణ

ప్రజాశక్తి-నగరి: వ్యక్తిత్వం గురించి నీచంగా మాట్లాడటంతో మంత్రి ఆర్కేరోజా వేసిన పరువు నష్టం కేసులో మాజీ మంత్రి బండారు సత్యనారాయణ శుక్రవారం నగరి కోర్టుకు హాజరయ్యారు. మెజిస్ట్రేట్ విష్ణువర్మ ఆయనకు కేసు సంబందిత రికార్డులు అందించి కేసును ఫిబ్రవరి 13కు వాయిదా వేశారు. కోర్టు వెలుపలకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి, మంత్రి రోజాపై విమర్శలు చెశారు. ప్రజాస్వామ్య విరుద్దంగానె కేసులు పెడుతున్నారని తమ ప్రభుత్వం వస్తే న్యాయబద్దంగా ప్రజలకు ఆధారాలు చూపించి కేసుపెడతా అన్నారు.

స్వామి వివేకానంద జీవితం

యువతకు ఆదర్శం

- ఘనంగా వివేకానంద జయంతి వేడుకలు
- చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించిన కలెక్టర్


కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకొని యువత ముందుకు వెళ్లాలని జిల్లా కలెక్టర్ షన్మోహన్ పేర్కొన్నారు. శుక్రవారం డీఆర్డీఏ సమావేశం నందు జిల్లా నెహ్రూ యువ కేంద్ర కోఆర్డినేటర్ ప్రదీప్, డీఆర్డీఏ పిడి తులసిలతో కలసి నెహ్రూ యువ కేంద్ర అద్వర్యంలో నిర్వహించిన జాతీయ యువజన దినోత్సవం, స్వామి వివేకానంద జయంతి వేడుకలలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకొని నేటి యువత ముందుకు వెళ్లాలని చూచించారు. యువతలోని శక్తి సామర్థ్యాలను బట్టి వారికి నచ్చిన వ్యక్తిలోని కొన్నింటిని పాజిటివ్‌గా తీసుకొని ముందుకు వెళ్లాలని, అప్పుడే వారి జీవితంలో ఏదైనా సాధించగలరని యువతకు సూచించారు. ప్రతి సంవత్సరం జనవరి 12వ తేదీన స్వామి వివేకానంద జయంతిని జరుపుకోవడం జరుగుతుందని, స్వామి వివేకానందునికి యువతతో లోతైన అనుబంధం ఉన్నందున కేంద్ర ప్రభుత్వం జాతీయ యువజన దినోత్సవంగా ప్రకటించి స్వామి వివేకానంద జయంతిని జరుపుకోవడం జరుగుతుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది యువత వివేకానంద స్వామిని ఆదర్శంగా తీసుకొని యువత దేశాభివృద్ధికి పాటుపడాలన్నారు. ఈ సమావేశంలో నెహ్రు యువ కేంద్ర కోఆర్డినేటర్ ప్రదీప్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన యువత ఓటర్లుగా నమోదు కావాలని సూచించారు. దేశ అభివృద్ధిలో యువత కీలక పాత్ర పోషిస్తుంది అన్నారు. ఇంకా 18 సంవత్సరాలు నిండిన యువత ఓటరుగా నమోదు కాకుండా ఉంటే వెంటనే ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. డీఆర్డీఏ పిడి మాట్లాడుతూ యువత అందరూ స్వామి వివేకానందుని మార్గంలో పయనించి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. అంతకు ముందు జ్యోతి ప్రజ్వలన చేసి స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వ్యాసరచనపై నిర్వహించిన కాంపిటేషన్‌లో గెలుపొందిన విద్యార్థులకు, స్వచ్ఛంద సంస్థల యన్‌జిఓలకు మెమెంటోలోలు కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో డిజెయం సరిత, నెహూరు యువ కేంద్ర అకౌంట్స్ ఆఫీసర్ బాబు రెడ్డి, ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని యన్‌జిఓలు, వివిధ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



అదరం.. బెదరం.... చెదరం

- 'ఎస్మా' ప్రయోగంతో దీక్షలు ఆగవు
- హామీలు పరిష్కరించాలని సర్కార్‌కు అంగన్వాడీ వర్కర్ల డిమాండ్
- 32వ రోజుకు చేరుకున్న అంగన్వాడీల దీక్షలు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: అంగన్వాడీ వర్కర్లు చేపట్టిన నిరవధిక సమ్మె దీక్షలు శుక్రవారానికి 32వ రోజుకి చేరుకుంది. శుక్రవారం అంగన్వాడీ వర్కర్లు జిల్లా కలెక్టరేట్ ఎదుట దీక్ష చేపట్టారు. దీక్షకు సీఐటీయూ, ఏఐటీయూసీ, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు సంఘీభావం తెలిపారు. జిల్లా నాయకులు సుజిని, షకీల, ప్రభావతి, రమాదేవిలు మాట్లాడుతూ అంగన్వాడీ వర్కర్లు,హెల్పర్లు, మినీ అంగన్వాడి వర్కర్లులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీని, ఉచిత భీమా సౌకర్యం, మినీ అంగన్వాడి సెంటర్లను మెయిన్ సెంటర్ గా గుర్తించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను అంగన్వాడీ కార్యకర్తలకు వర్తింపజేయాలనే ప్రధాన డిమాండ్‌లను ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు. గత 32 రోజులుగా నిరవధిక సమ్మె చేపడుతున్న జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం మొండి వైఖరి అవలంబిస్తూ సమస్యలను పరిష్కరించడంలో చొరవ చూపకపోవడం దారుణం అన్నారు. తన దుర్మార్గపు ఆలోచనతో అంగన్వాడి వర్కర్ల ఉద్యమాన్ని నిర్వీర్యం చేయడానికి ఎస్మా చట్టం, జీవో నెంబర్ 2ను విడుదల చేసి అంగన్వాడీ కార్యకర్తలను ఉద్యోగం నుండి తొలగిస్తామని బెదిరించడాన్ని, అధికార పార్టీలకు సంబంధించిన నాయకులు చేత, పోలీసులు చేత అంగన్వాడి కార్యకర్తలను బెదిరించడాన్ని, భయభ్రాంతులు చేయడాన్ని ప్రభుత్వం మానుకోవాలని లేనిపక్షంలో మరొక ఉద్యమం రుచి చూడవలసి వస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఇలాంటి బెదిరింపులకు అంగన్వాడి కార్యకర్తలు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. సిఐటియు జిల్లా కార్యదర్శి కాంజివరం సురేంద్రన్ మాట్లాడుతూ గతంలో జగన్మోహన్ రెడ్డి తన పాదయాత్రలో ఇచ్చిన హామీలను నెరవేర్చకపోగా సమ్మె చేస్తున్న అంగన్వాడీ కార్మికుల సమస్యలను పరిష్కరించకపోగా వారిని రోడ్డున పడవేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికైనా చర్చకు ఆహ్వానించి డిమాండ్‌లు పరిష్కారానికి కృషి చేయాలన్నారు.

జనవిజ్ఞాన వేదిక నాయకుల సంఘీభావం

ప్రజాశక్తి-పలమనేరు: మండలంలో ఐసిడిఎస్ ఆఫీసు వద్ద అంగన్వాడీలు చేపడుతున్న దీక్షకు జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు వైవి నాగేశ్వరరావు, కడప కార్యదర్శి సురేష్, ఎల్ఐసి డివిజన్ కార్యదర్శి కుమార్‌స్వామి సంఘీభావం తెలియజేశారు. వారు మాట్లాడుతూ 32 రోజులుగా నిరవధికంగా సమ్మె చేస్తున్నటువంటి అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యొక్క న్యాయమైన డిమాండ్‌లను ప్రభుత్వం వెంటనే పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ప్రశాంతమైన వాతావరణంలో సమ్మె చేస్తున్నటువంటి అంగన్వాడీల సమస్యలను పరిష్కారం చేయాల్సింది పోయి, ఎస్మా ప్రయోగించడం, భయభ్రాంతులను చేయడం సరికాదన్నారు. ఈ నిరసన కార్యక్రమాన్ని సిఐటియు నాయకులు గిరిధర్ గుప్తాయ తదితరులు పాల్గొన్నారు.


సంఘీభావం తెలుపుతున్న జన విజ్ఞాన వేదిక నాయకులు

పుంగనూరులో పోలీసుల అరాచకం..


కార్యకర్తలను బలవంతంగా ఈడ్చుకెళుతున్న పోలీసులు (ఇన్‌సెట్‌లో) రామచంద్రాయాదవ్‌తో వాగ్వాదం చేస్తున్న పోలీసులు


కార్యకర్తను చెప్పుతో కొడుతున్న పోలీసులు

- బీసీవై కార్యకర్తలను చెప్పులతో కొట్టిన పోలీసులు
- ధర్మ పోరాట సభ భగ్నం
- ఇది పిరికిపంద చర్య.. వైసీపీకి రోజులు దగ్గరపడ్డాయి : రామచంద్రయాదవ్

ప్రజాశక్తి-పుంగనూరు: భారత యువజన చైతన్య పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్ చేపట్టిన ధర్మ పోరాట సభను పోలీసులు భగ్నం చేశారు. పుంగనూరు మండలం చదల్ల గ్రామం వద్ద ధర్మ పోరాట సభకు ఏర్పాటు చేస్తుండగా పోలీసులు అనుమతులు లేవంటూ శుక్రవారం పోలీసులు భారీగా మొహరించి సభకు అనుమతులు లేవంటూ బలవంతంగా కార్యకర్తలను స్టేషన్కు తరలించారు. ఈ సందర్భంగా పోలీసులు బిసివైపి కార్యకర్తలపై చెప్పులు దాడులు కూడా చేశారు. ధర్మ పోరాట సభకు పలమనేర్ డీఎస్పీ సుధాకర్ రెడ్డికి రామచంద్ర యాదవ్ అనుమతి ఇవ్వాలని కోరడంతో దీనిపై డీఎస్పీ సభను ఏర్పాటు చేసేందుకు కుదరదని లా అండ్ ఆర్డర్ సమస్య వస్తుందని, ట్రాఫిక్కు, సింగిల్ రోడ్డు ఇరుకైన రోడ్లు ఉన్నందున సభకు అనుమతులు ఇవ్వడానికి కుదరదని రద్దు చేసుకోవాలని పోలీసులు సభా స్థలం వద్దకు చేరుకుని రామచంద్ర యాదవ్ నోటీస్ అందించారు. దీనిని ఆయన తిరస్కరించడంతో పోలీసులు భారీగా మొహరించి బలవంతంగా సభను భగ్నం చేసి కార్యకర్తలను పోలీస్‌స్టేషన్లకు తరలించారు. దీనిపై రామచంద్ర యాదవ్ విలేకరులతో మాట్లాడుతూ ప్రైవేటు స్థలంలో సభను ఏర్పాటు చేసేందుకు పోలీసులు అడ్డంకులు సృష్టించడం కార్యకర్తల పైనా దాడులు చేయడంపై తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య దేశంలో ఉన్నామా లేక నియంతృత్వ రాష్ట్రంలో ఉన్నామా పోలీసులు తీరు సరికాదు అన్నారు. దౌర్జన్యాలు, దాడులు, అక్రమ అరెస్టులు చేయడం పిరకిపంద చర్య అని మండిపడ్డారు. పోలీసులు భయభ్రాంతులను గురి చేయడం వ్యవస్థ ఎటు దారితీస్తుందో ప్రజలే గమనించాలన్నారు. రామచంద్రారెడ్డి గత నాలుగున్నర సంవత్సర కాలంలో దాడులు, దౌర్జన్యాలు, అక్రమాలు, ఎర్రచందన స్మగ్లింగ్, భూకబ్జాలు, రౌడీయిజం, గుండాయిజం ప్రోత్సహిస్తూ ప్రశాంతమైన పుంగనూరు నియోజకవర్గాన్ని భయభ్రాంతులకు గురిచేస్తూ ప్రజలను అన్ని రకాల వేధించే కార్యక్రమాలు చేస్తున్నారన్నారు. రెండు నెలల్లో వైసీపీ పాలనకు అంతం పలికే సమయం ఆసన్నమైందనరు. పోలీసులను అడ్డం పెట్టుకుని మాపై దాడులు చేస్తే మేము సహించమని, మంత్రి చిత్తూరు జిల్లాలోనే కాదు ఇలాంటి నీచమైన కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా కూడా చేస్తున్నారని ఆరోపించారు. నియోజకవర్గంలో ఏ కార్యక్రమం చేపట్టాలన్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పని కట్టుకొని పోలీసులను ఉసిగొలుపుతూ కార్యక్రమాన్నిటిని అడ్డుకుంటున్నారని ఆరోపించారు.

సభా ఏర్పాట్లలో పోలీసుల విధ్వంసం

సభా నిర్వహణకు అన్నీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఆర్సీవై నేతృత్వంలో కార్యకర్తలు చేరుకుని ఏర్పాట్లలో నిమగ్నమ్యారు. ఈ క్రమంలో భారీగా చేరుకున్న పోలీసులు అక్కడ విధ్వంసం సృష్టించారు. పుంగనూరు సీఐ రాఘవరెడ్డి, చౌడేపల్లి సీఐ కృష్ణారెడ్డి సహా భారీ సంఖ్యలో పోలీసులు బీసీవై కార్యకర్తలపై దాడికి దిగుతూ, కొట్టుకుంటూ, నేలపై పడేసి ఈడ్చుకుంటూ మొత్తం మెటీరియల్‌ను ధ్వంసం చేశారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సొంత మనుషుల్లా, వైసీపీ కార్యకర్తల మాదిరిగా పోలీసులు వ్యవహరిస్తూ.. ఇలా చేయడంతో బీసీవై శ్రేణులు నిశ్చేష్టులై ఉండిపోయారు. అధినేత రామచంద్ర యాదవ్ పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఈ వ్యవహారం మొత్తంపై పోలీసులే బాధ్యత వహించాలని, పెద్దిరెడ్డి పాలేర్లుగా వ్యవహరిస్తున్న ప్రతీ పోలీసులు భవిష్యత్తులో మూల్యం చెల్లించుకోక తప్పదని బీసీవైపీ అధినేత రామచంద్రాయాదవ్ హెచ్చరించారు.

రైతులపై దౌర్జన్యం చేయడం దారుణం


- సీపీఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు ఖండన


వాడ గంగరాజు

ప్రజాశక్తి-పుంగనూరు: పుంగనూరులో ప్రజాస్వామ్యం రోజు రోజుకి ఖూనీ అవుతున్నా రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం చలించకపోవడం దుర్మార్గమని శుక్రవారం పుంగనూరులో రైతులపై, ప్రజలపై దుర్మార్గంగా పోలీసులు దాడి చేయడాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుంగనూరు నియోజకవర్గంలో ఉన్న సమస్యల పైన రాష్ట్రంలో వున్న సమస్యలను ప్రతిపక్షాలు కానీ, కార్మికులు, ఉద్యోగులు ఎవరు గొంతు వినిపించిన పుంగనూరు నియోజకవర్గంలో అధికార పార్టీ అండతో పోలీసులు ఇష్టారాజ్యంగా అణిచివేయడానికి ప్రయత్నం చేస్తున్నారని ఇది దుర్మార్గమని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన పోలీసులే అప్రజాస్వామికంగా వ్యవహరిస్తూ ఇష్టారాజ్యంగా దాడి చేయడం ఏమిటని ప్రశ్నించారు. నిరసన తెలియజేసే హక్కు ఎవరికైనా ఉందని అలాంటి సందర్భంలో పోలీసులే భౌతిక దాడులు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. శుక్రవారం చౌడేపల్లి రోడ్డు చదళ్ళ వద్ద జరిగిన సంఘటనలో పోలీసులు ప్రజలను చెప్పుతో కొట్టడం అత్యంత దుర్భర ఘటన అన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కు ప్రకారం ప్రజా సమస్యలపై ఎవరైనా మాట్లాడవచ్చున్నారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీలు 32 రోజులుగా సమ్మె చేస్తుంటే పుంగనూరు నియోజకవర్గంలో ఉన్న పులిచెర్ల, పుంగనూరు ప్రాజెక్టులలో స్వయంగా అధికార పార్టీ నాయకులు దిగి అధికారులను ఉసిగొల్పి అంగనవాడిలను భయభ్రాంతులకు గురిచేసిన సంఘటన చూస్తున్నామన్నారు. మరి రాష్ట్రంలో జరుగుతున్న అన్యాయాలపైన మాట్లాడితేనే ఎందుకంత భయపడిపోతున్నారో అర్థం కాని పరిస్థితి ఉందన్నారు. పుంగనూరు నియోజకవర్గంలో సమస్యలే లేకుండా చేస్తే ప్రజలు ఎవరూ కూడా ప్రశ్నించే పరిస్థితి ఉండదు కదా మరి సమస్యలపై ఎందుకు దృష్టి పెట్టకుండా ప్రశ్నించిన వారిపై దాడి చేయడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. రాజకీయాలు ఉంటే రాజకీయంగా ఎదుర్కోవాలి కానీ భౌతికంగా దాడులు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. పోలీసులు కూడా ఆలోచించాలని వ్యక్తిగతంగా విమర్శిస్తే వారిపై చర్యలు తీసుకోవాలని సమస్యలపై ప్రశ్నిస్తే ఎందుకు దాడి చేస్తారని ప్రశ్నించారు. మహిళలను కూడా చూడకుండా బెదిరించి సమ్మెలో లేకుండా చేసిన పరిస్థితి పుంగనూరు నియోజకవర్గంలో ఉందన్నారు. అరచేతితో ఉద్యమాలు ఆపలేరని తెలిపారు. పుంగనూరు నియోజకవర్గంలో ఉన్న రైతులు సమస్యలు కార్మికులు ఉద్యోగుల సమస్యలపై సిపిఎం నిరంతరం పోరాడుతుందని ప్రజలకు అండగా ఉంటుందని తెలిపారు.

సెలవుల్లోనూ 'శిక్ష'ణ..!

- ట్యాబ్ల పంపిణీ, వాడకంపై ట్రైనింగ్
- వెంటనే విద్యార్థులకు ఇవ్వాలని హుకుం
- అంత హడావిడి ఎందుకంటున్న టీచర్లు



ప్రజాశక్తి - తిరుపతి

ఉపాధ్యాయులకు సంక్రాంతి సెలవుల్లోనూ 'శిక్ష'ణ తప్పడం లేదు. ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్, ట్యాబ్‌లు, నాడు – నేడు పనులు పూర్తి అంటూ ప్రభుత్వం హడావిడి చేస్తోంది. విద్యార్థులకు ఇచ్చిన ట్యాబ్‌ల నిర్వహణపై శిక్షణ ఇవ్వాలంటూ హుకుం జారీ చేయడంతో టీచర్లు సంక్రాంతి సెలవుల్లోనూ విధి నిర్వహణలో తలమునకలు అవుతున్నారు. పండగ సెలవుల్లో కుటుంబీకులతో ప్రశాంతంగా గడపడానికి వీల్లేకుండా, మానసిక ప్రశాంతత లేకుండా ప్రభుత్వం విధులు అప్పగిస్తోందని వాపోతున్నారు. అంత హడావిడిగా మండలాలకు ట్యాబ్‌లు ఎందుకు పంపించాలని ప్రశ్నిస్తున్నారు. సెలవులైన తరువాత పంపిణీ చేయొచ్చన్న వాదన టీచర్ల నుంచి వినిపిస్తోంది.

ఇటీవలే ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి చదివే విద్యార్థులకు ట్యాబ్లు అందించారు. అయితే పిల్లలకు సరిపడా అప్పట్లో రాలేదు. ప్రస్తుతం ఇండెంట్ మేరకు వచ్చిన ట్యాబ్లు లలో ఇన్స్టలేషన్, కంటెంట్ లోడింగ్ను వెంటనే పూర్తి చేయాలంటూ టీచర్లపై ఒత్తిడి తెస్తున్నారు. అలాగే వాటిని విద్యార్థులకు అందించాలంటే సంబంధిత తరగతి టీచర్లు స్కూలుకు రావాలి. వాటి వినియోగం గురించి పిల్లలకు తెలియజేయడానికి సబ్జెక్టు టీచర్లు అందుబాటులో ఉండాలి. ఇవన్నీ పండగ సెలవుల్లోనే ఎందుకు పెట్టు కుంటున్నారు? ఉద్దేశపూర్వకంగానే ఉపాధ్యాయుల్ని ఇబ్బంది పెట్టడానికే ఇవి చేస్తున్నారని ఉపాధ్యాయ వర్గం ప్రశ్నిస్తోంది.

అలాగే రెండో విడతలో నాడు–నేడు పనులకు ఎంపి కైన పాఠశాలలకు తాజాగా ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానళ్లు పంపారు. వాటిని ఈ సెలవుల్లోనే బిగించాలని ఆదేశాలు వచ్చాయి. వాటి ఏర్పాటుకు అవసరమైన వ్యయాల్ని మాత్రం పంప లేదు. ఉన్న నిధుల నుంచి వెచ్చించుకోవాలని సూచించడం పట్లా తీవ్ర ఆగ్రహం వ్యక్తం అవుతుండటం గమనార్హం.

రేపు ట్యాబ్స్ పంపిణీ చేయాలి : డిఇఓ

ఈరోజు డిఇఓ ఆఫీసు నుంచి ట్యాబ్స్‌ను ఎంఇఓలు తీసుకెళ్లారు. రేపు ఎటువంటి పరిస్థితుల్లోనూ పిల్లలకు పంపిణీ చేయాలి. ఇపుడే ఈ విషయాన్ని హెచ్‌ఎంలకు సమాచారం ఇవ్వండి. రేపే పిల్లల్ని పిలిపించుకుని ట్యాబ్స్ ఇచ్చి, ఎలా ఉపయోగించుకోవాలో తెలియజేయండి. ఒక్కో మండలానికి కనీసం రూ.1.50 కోట్ల నుంచి 3 కోట్ల విలువ గల ట్యాబ్‌లు ఇచ్చారు. ఎంఆర్‌సిల్లో రాత్రిపూట కనీసం ఇద్దరిని కాపలా పెట్టండి. ఎటువంటి పరిస్థితుల్లోనూ ఎంఆర్‌సిల్లో, స్కూళ్లలో స్టాక్ ఉండరాదు. చోరీకి గురైతే చాలా సీరియస్ యాక్షన్ ఉంటుంది.

సెలవుల్లో ఒత్తిడి మానుకోవాలి
- ముత్యాల రెడ్డి, ప్రధాన కార్యదర్శి, యూటీఎఫ్



'అసలు సెలవుల్లో పనిచెప్పి వేధించడం సబబు కాదు. సంక్రాంతి సెలవుల తరువాతే టాబ్ ల పంపిణీ, ఇన్స్టలేషన్‌ను పూర్తి చేస్తారు. అలాగే నాడు – నేడు పనులు దాదాపు పూర్తయ్యాయి. వీటిపై ఓ కమిటీ పర్యవేక్షణ చేస్తోంది. రాష్ట్ర స్థాయి అధికారుల సూచనల మేరకే జిల్లా, మండల స్థాయి అధికారులు వ్యహరించాలి. అలా కాకుండా సెలవుల్లో పనిచేయాలని ఒత్తిడి చేయడం మానుకోవాలి.

రక్తదానం ప్రాణదానంతో సమానం

డీఎంహెచ్‌వో ప్రభావతి దేవి

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: రక్తదానం ప్రాణదానంతో సమానమని జిల్లా ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రబావతి దేవి అన్నారు. శుక్రవారం జిల్లా హాస్పిటల్ చిత్తూరు, పలమనేరు, నగరి, కుప్పంలో "నేషనల్ యూత్ డే" సందర్భంగా సామాజిక సమతా సంకల్పంతో బ్లడ్ బ్యాంక్‌లో స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించి స్వచ్ఛందంగా రక్తదానం చేయుటతో అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగికి ఈ రక్తం, ప్రాణదానంతో సమానమని తెలిపారు. మనుషుల జీవితాన్ని కాపాడిన వారు అవుతామని పేర్కొన్నారు. ఈ విషయాన్ని అందరికీ అవగాహన కల్పించి స్వచ్ఛందంగా రక్తదానం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ్ కుమార్, డాక్టర్ శిరీష, గుణశేఖర్ పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న ఉద్యోగులు

పేదలకు చీరలు పంపిణీ

ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని నల్లవెంగనపల్లి పంచాయతీలో పేద మహిళలకు చీరలు పంపిణీ కార్యక్రమం జరిగింది. శుక్రవారం మాజీ సర్పంచ్ కావలి రాజేంద్రన్ ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. పంచాయతీ పరిధిలో ఉన్న గ్రామాలలో పేద మహిళలను గుర్తించి సంక్రాంతి పండుగ సందర్భంగా చీరలను పంచిపెట్టారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం: జెడ్పిటిసి

ప్రజాశక్తి-సోమల: మహిళలు ఆర్థికంగా ఎదిగి తమ కుటుంబాలను ఉన్నత స్థితిలో నిలపాలనదే ప్రభుత్వాల లక్ష్యంగా మహిళలకు ఆసరా పథకం ద్వారా మరింత లబ్ధి చేకూరుస్తున్నట్లు జడ్పిటిసి అమాస కుసుమమోహన్ అన్నారు. శుక్రవారం ఆవులపల్లె గ్రామంలో వైయస్సార్ ఆసరా పథకంలో భాగంగా మహిళలతో గ్రామ సభను నిర్వహించారు. మహిళా సంఘాలలోని మహిళలు బ్యాంకు రుణాలు తీసుకొని సకాలంలో వాటిని చెల్లించి ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం ఎన్నో చర్యలు చేపట్టిందని ఇందులో భాగంగానే మహిళలకు వారు తీసుకున్న రుణానికి సంబంధించి ఆసరా పథకం ద్వారా ఆదుకుంటోందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు యువత ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి-రామకుప్పం: మండల పరిధిలోని పంద్యాలమడుగు గ్రామపంచాయతీ నందు తెలుగు యువత ఆధ్వర్యంలో మెగా క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించినట్లు తెలుగు యువత అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి విశ్వనాథ్, వెంకటాచలం తెలిపారు. ఈనెల 13 నుంచి 16వరకు ఎన్టీఆర్ స్మారక క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తామన్నారు. మొదటి బహుమతి రూ.50వేలు, రెండవ బహుమతి రూ.30 వేలు, మూడవ బహుమతి రూ.20వేలు, నాలుగవ బహుమతి రూ.10 వేలు ప్రకటించారు. క్రికెట్ ఆసక్తి గలవారు టోర్నమెంట్‌లో పాల్గొన్నాలని కోరారు.

క్రికెట్ విజేతలకు అభినందనలు: ఎంపిపి

ప్రజాశక్తి-వెదురుకుప్పం: వెదురుకుప్పం మండల స్థాయి ఆడుదాం ఆంధ్ర క్రికెట్ పోటీల్లో శుక్రవారం జక్కదన్న క్రికెట్ జట్టు ఘనవిజయం సాధించడంతో ఎంపిపి బండి నాగరాణి హేమసుందరెడ్డిలు క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. మండల స్థాయిలో జరిగిన క్రికెట్ పోటీలలో జక్కదన సచివాలయ పరిధిలోని కుర్రాళ్ళు ఫైనల్‌లో గెలవడం శుభసూచకమని ప్రశంసించారు. కుర్రాళ్లకు తమ వంతు ఎలాంటి సహాయ సహకారాలు అందించాలన్న ముందుంటామని భరోసా ఇచ్చారు. క్రికెట్ టీంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి పేరుపేరునా అభినందనలు తెలియజేస్తున్నట్లు చెప్పారు.

చంద్రబాబు సీఎం కావాలని ప్రార్థనలు

ప్రజాశక్తి-రామకుప్పం: టిడిపి అధినేత చంద్రబాబు రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ముఖ్యమంత్రి కావాలని రామకుప్పం జామియా మసీదులో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు (దువ) నిర్వహించారు. శుక్రవారం కుప్పం నియోజకవర్గ పరిశీలకులు గాజుల ఖాదర్ భాషా, ముస్లిం సోదరులు కలిసి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గంలో లక్ష ఓట్ల మెజార్టీయే లక్ష్యంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్దార్ సాబ్, అన్సార్సాబ్, జిల్లా మైనార్టీ సభ్యులు సలాం సాబ్, అదిల్, హనీఫ్ సాబ్, అక్బర్, నియాద్ అహ్మద్, జలిల్ సాబ్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్య సంపద పెంపొందాలి

- కార్పొరేషన్ ఛైర్మన్ కుమార్ రాజా

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: మత్స్య సంపద పెంపొందించేందుకు చెరువులో చేప పిల్లల విడుదల కార్యక్రమం చేపడుతున్నట్లు రాష్ట్ర పాల ఎకిరి కార్పొరేషన్ చైర్మన్ కుమార్ రాజా అన్నారు. శుక్రవారం మండలంలోని వెంకటప్పనాయనవారి చెరువులో ఎఫ్డిఓ ప్రవీణ్ ఆధ్వర్యంలో చేప పిల్లల విడుదల కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా కుమార్‌రాజా మాట్లాడుతూ రాష్ట్రంలో మత్స్య సంపాదన పెంపొందించేందుకు ప్రభుత్వ మత్స్య సంస్థ తరపున 40వేల చేప పిల్లలను పీఎం సమృద్ధి మత్స్య సంపద ద్వారా 6500 పిల్లలను చెరువుల్లో వదలడం జరిగిందని మత్స్యకారులను ఆదుకుని మత్స్య సంపదను అభివృద్ధి చేసే విధంగా ఈ కార్యక్రమాలు చేపడుతున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో జడ్పిటిసి సోమశేఖర్, ఫీల్డ్ అసిస్టెంట్ గౌరి, గంగాపుత్ర సహకార సంఘ అధ్యక్ష కార్యదర్శులు నాగరాజు, ఉమాపతి, ఉపాధ్యక్షులు రెడ్డప్ప, సభ్యులు కేశవులు, చంద్రశేఖర్, రఘు తదితరులు పాల్గొన్నారు.



చేప పిల్లలు వదులుతున్న అధికారులు, నాయకులు

22న ఓటరు తుది జాబితా

- పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు సిద్ధం చేయండి
- సమన్వయంతో ఎన్నికల విధులు నిర్వహించాలి
- పౌరులు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకొనేలా చూడాలి
- అధికారులకు కలెక్టర్ దిశానిర్దేశం

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం జెడ్పి సమావేశ మందిరంలో సెక్టోరియల్ అధికారులు, ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వోలు, ప్రత్యేక అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలుగా గుర్తించిన పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలను ఉపయోగించడంలో మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు గ్రామీణ ప్రాంతాలలో తహాశీల్దార్‌లు, అర్బన్ పరిధిలో కమిషనర్లు పూర్తి బాధ్యత వహించాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులు కల్పనకు సంబంధించి సమగ్ర శిక్ష ఏపీసి, పంచాయతీ రాజ్ ఎస్ఈలను సమన్వయం చేసుకొని పనులను పూర్తి చేయాలన్నారు. ప్రధానంగా పోలింగ్ కేంద్రాలలో మరుగుదొడ్లు, త్రాగునీరు, ఫర్నిచర్, విద్యుత్, లైట్లు, ఫ్యాన్లు తదితర సౌకర్యాలు సక్రమంగా ఉండేలాచూడాలన్నారు. అలాగే విభిన్న ప్రతిభావంతులు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి కేంద్రాల వద్ద ర్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, సెక్టోరియల్ అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. ఆయా పాఠశాలల హెచ్ఎంలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈనెల 22న ఓటర్ల తుది జాబితాను విడుదల చేయడం జరుగుతుందని, ఎన్నికల నిర్వహణలో దోష రహిత ఓటర్ల జాబితా కీలకమని అలాంటి జాబితాను తయారీలో రాజకీయ పార్టీల నుండి వచ్చిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా పరిష్కరించాలని తెలిపారు. నిష్పక్షపాతంగా, బాధ్యతాయుతంగా ఎన్నికల విధులను నిర్వర్తించాలన్నారు. సమావేశంలో జెసీ శ్రీనివాసులు, డిఆర్‌ఓ రాజశేఖర్, జెడ్పి సీఈఓ ప్రభాకర్ రెడ్డి, పంచాయతీరాజ్ ఎస్ఈ చంద్రశేఖర్ రెడ్డి, సమగ్ర శిక్ష ఏపిసి వెంకటరమణారెడ్డి, డీఈఓ విజయేంద్రరావు, వ్యవసాయ, ఉద్యానవన, మత్స్యశాఖల అధికారులు మురళీకృష్ణ, మధుసూదన్ రెడ్డి, శ్రీనివాస రావు, మున్సిపల్ కమిషనర్ అరుణ, ఆర్డీఓలు చిన్నయ్య, మనోజ్‌కుమార్ రెడ్డి, సుజన, శ్రీనివాసులు, ఐసిఓఎల్ డిప్యూటీ కలెక్టర్ భవాని, ట్రైన్ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

క్రైం కార్నర్


గుర్తు తెలియని వ్యక్తి మృతి



ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: చిత్తూరు ఆర్టీసీ బస్టాండులో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉండడాన్ని శుక్రవారం ఉదయం స్థానికులు గుర్తించారు. వివరాలు.. చిత్తూరు ఆర్టీసీ బస్టాండులో శుక్రవారం ఉదయం సుమారు 70ఏళ్ల వయసున్న వృద్ధుడు స్పృహ లేకుంఆ పడిఉండడాన్ని స్థానికులు గుర్తించి 108కి సమాచారం ఇచ్చారు. చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చిత్తూరు ఆసుపత్రిలో చికిత్స పొందతూ మద్యాహ్నం మృతి చెందాడు. అతని ఆచూకీ తెలిసిన వారు సమాచారం ఇవ్వాలని సీఐ విశ్వనాథరెడ్డి కోరారు.

పందెం రాయుళ్లపై ఉక్కుపాదం

- జల్లికట్టు, కోడిపందేలు జరగటానికి వీల్లేదు
- ముమ్మర చర్యలు చేపట్టి కేసులు నమోదు చేయండి
- సెట్ కాన్ఫరెన్స్‌లో పోలీసులకు ఎస్పీ ఆదేశాలు



ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: జిల్లాలో జల్లికట్టు, కోడి పందేలు జరుగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. పందేల నిర్వహించడం నిషేధమని పేర్కొంటూ ఆయన పోలీసు అధికారులతో వైర్లెస్ సెట్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.పి మాట్లాడుతూ జిల్లాలో కోడి పందేలు కట్టడికి రెవిన్యూ, జంతు సంక్షేమ సిబ్బంది, తదితర విభాగాలతో కలసి పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. మండల స్థాయిలో తహశీల్దార్, ఎస్ఐ, జంతు సంక్షేమ బోర్డు సిబ్బంది, ప్రత్యేక బృందంగా ఏర్పడి గ్రామాల్లో నిఘా కొనసాగించాలని, ఈ విషయంపై ప్రజలలో అవగాహన కల్గించుటకు ఆటోలలో లౌడ్ స్పీకర్‌ల ద్వారా ప్రచారం చేయాలని సీఐ, ఎస్ఐలు గ్రామస్థాయిలో సర్పంచులు, గ్రామ పెద్దలతో సమావేశాలు నిర్వహించి కోడి పందేలు జరుగకుండా ఉండేలా సమాయత్తం చేయాలన్నారు. సంబంధిత డిఎస్పీలు అప్రమత్తంగా ఉంటూ పర్యవేక్షణ పక్కాగా కొనసాగించాలన్నారు. జల్లికట్టు, కోడి పందేలు జరిగే వీలున్న ప్రాంతాల్లో పికెట్లు ఏర్పాటు చేయాలనని, గతంలో దీనికి సంబంధపడి కేసులున్న వారిని ముందస్తుగా బైండోవర్ చేయాలన్నారు. కోళ్లకు కత్తులు కట్టి పందేలు ఆడటం మూగ జీవాలను హింసించడమే అవుతుందని, సంక్రాంతి పురస్కరించుకుని కోడి పందేలు, తదితర చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడరాదన్నారు. కోడి పందేల నిర్వహణ వేదికలకు ఎవరైనా తోటలు, స్థలాలు ఇస్తే వారిపై కూడా కేసులు నమోదు చేయాలని, ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. కోడి పందేలు నిర్వహిస్తే ప్రివెన్షన్ ఆఫ్ క్రూయల్టీ టు అనిమల్ యాక్టు, ఎ.పి. గేమింగ్ యాక్టుల కింద కేసులు నమోదు చేయాలన్నారు. అసాంఘిక కార్యక్రమాల జోలికెళ్లకుండా ఇంటిల్లిపాది సంక్రాంతి పండుగను ప్రజలు సుఖ, సంతోషాలుతో జరుపుకోనేటట్లు చూడాలన్నారు. జిల్లాలో ఏ ప్రాంతంలోనైనా జల్లికట్టు, కోడి పందేలు జరుగుతున్నా జరిగే వీలున్నా వెంటనే డయల్-100 లేదా జిల్లా పోలీసు వ్యాట్సాప్ నంబర్ 9440900005కు ఫోన్ లేదా సంక్షిప్త సందేశం రూపంలో చేరవేయవచ్చన్నారు. తమ సిబ్బంది వెంటనే చర్యలు తీసుకుంటారన్నారని, సమాచారం చేర వేసిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని ఆయన తెలిపారు. అదేవిధంగా సంక్రాంతి పండగ సందర్భంగా వరుస సెలవులు ఉన్నవి, అందువలన ప్రజలు, టీచర్లు, ప్రభుత్వ ఉద్యోగులు ఇళ్లకు తాళంవేసి గ్రామాలకు వెళుతుంటారు. ఇటువంటి సందర్భాలలో దొంగతనాలు ఎక్కువగా జరిగే ఆస్కారం ఉంది. అదేవిధముగా బ్యాంకులు, ఫైనాన్స్ కంపెనీలు వరుస సెలవులు కావున తాళం వేసి ఉంటారు. కావున ప్రజలు తాళం వేసి ఊర్లకు వెళ్లేవారు తమ వివరాలు సంబందిత పోలీసుస్టేషన్‌లో తెలిపాలన్నారు. పోలీసులు ఇళ్ళలో కెమరాలు ఏర్పాటు చేసి ప్రత్యేక నిఘా ఏర్పటు చెయ్యడం జరుగుతుందన్నారు. బ్యాంకులు, ఫైనాన్స్ కంపెనీలు, బంగారు దుకాణాల రక్షణ కొరకు ప్రత్యేకమైన బీట్ లేదా పాట్రోల్ ఏర్పాట్లు చేయడం ద్వారా గట్టి నిఘా ఏర్పరచి వాటిలో దొంగతనాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

టిడిపి సీనియర్ నేత మృతికి నివాళి

ప్రజాశక్తి-రామకుప్పం: మండల పరిధిలోని ఆవుల కుప్పం గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నేత, రాష్ట్ర ఈడిగ సాధికార సమితి సభ్యుడు చంద్రశేఖర్ అనారోగ్యంతో మృతి చెందాడు. శుక్రవారం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, నియోజకవర్గ టిడిపి నేతలు కలిసి వారి భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి ఆవిర్భావం నుంచి చంద్రశేఖర్ తెలుగుదేశం పార్టీకి ఎనలేని కృషి చేశారని, పార్టీ సభ్యత్వానికి అహర్నిశలు శ్రమించారన్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటు అన్నారు. చంద్రబాబు ఆదేశాల మేరకు తక్షణసాయంగా రూ.50 వేలు కుటుంబ సభ్యులు అందించారు. కార్యక్రమంలో నాయకులు మునిరత్నం, డాక్టర్ సురేష్‌బాబు, మునస్వామి, ఆనంద రెడ్డి, ఆంజనేయ రెడ్డి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చాలా గొప్పది

- శిబిరాన్ని పరిశీలించిన డీఐవో, ఆర్డీవో

ప్రజాశక్తి-నగరి: రక్తదానం ఎంతో గొప్పదని జిల్లా టీకా అధికారి డాక్టర్ రవిరాజు అన్నారు. శుక్రవారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో సామాజిక సంకల్పం పేరిట నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయిలో నగరి, కుప్పం, పలమనేరులో శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. రక్తదానం చాలా గొప్పదన్నారు. వలంటీర్లు పలువురిని ప్రోత్సహించడం, వారే ముందుకు వచ్చి రక్తదానం చేయడంతో శిబిరానికి అనూహ్య స్పందన వచ్చిందన్నారు. ప్రతి యువత రక్తదానం చేయడానికి ముందుకు వచ్చి ప్రాణాలు కాపాడాలని కోరారు. మందులు మెడికల్ షాపులో దొరుగుతుందని కొని వేసుకోవచ్చని రక్తం అలాకాదన్నారు. అది ఒక మనిషి నుంచి తీసివ్వాల్సిందే అన్నారు. ప్రమాదాల్లో గాయపడిన వారి తో పాటు డెంగ్యూ జ్వరంతో ప్లేట్‌లెట్స్ పడిపోయిన వారికి కూడా రక్తం అవసరమౌతుందన్నారు. ఆర్డీవో సుజన మాట్లాడుతూ మనం ఇచ్చే రక్త ం ఒక మనిషి ప్రాణాన్ని కాపాడుతుందన్నారు. కార్యక్రమంలో వైద్యు లు మంజుల, ఆర్ఐ మేఘవర్ణం, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న అధికారులు

మంత్రి చొరవతో కంటి చికిత్సలు

- ముగిసిన కంటివైద్య శిబిరం
- 8 రోజులపాటు జరిగిన శిబిరంలో 720 మందికి చికిత్స

ప్రజాశక్తి-నగరి: కంటి సమస్యలు ఉన్నవారికి ఉచిత చికిత్స అందించడానికి, కంటి పొరలున్న వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయించడానికి మంత్రి ఆర్‌కే రోజా తన ఛారిటబుల్ ట్రస్టు ద్వారా శంకర నేత్రాలయ సహకారంతో 8 రోజుల పాటు నగరిలో కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద జరిగిన ఈ శిబిరానికి 8 రోజుల్లో 720 మంది పేషంట్లు చికిత్స నిమిత్తం విచ్చేశారు. 93 రకాల కంటికి సంబంధిత వ్యాధులను పరిశీలించిన వైద్యులు వీరిలో 137 మందికి స్థానికంగానే నొప్పి లేకుండా, కుట్లు లేకుండా అత్యాధునిక పద్ధతిలో ఆపరేషన్ చేసి రెండు గంటల వ్యవధిలో వారిని ఇంటికి పంపించేశారు. పెద్ద ఎత్తున కంటి సమస్యలు ఉన్నవారు 200 మందిని వివిధ కంటి చికిత్సల నిమిత్తం శంకరనేత్రాలయ బేస్ సెంటర్‌కు తరలించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ నీలమేఘం మాట్లాడుతూ కొన్ని దశాబ్దాలుగా రాజకీయాల్లో ఉన్నానని నగరి చరిత్రలో ఇలాంటి కంటి వైద్య శిబిరం నిర్వహించిన నాయకులు ఎవరూ లేదన్నారు. అలాంటి మంచి మనసున్న వ్యక్తికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలన్నారు. ఆపరేషన్ చేసుకున్నవారు తీసుకోవలసిన జాగ్రతలను వైద్యసిబ్బంది క్షుణ్ణంగా వివరించారు. కంటి వేసుకునే మందులు, కంటిలో నీరు వస్తే తుడవడానికి వాడే నాప్కిన్స్, ప్రతి రోజు వేసుకోవాల్సిన మందులకు సంబంధిత కిట్‌ను అందించారు. అందరికీ వైద్యసిబ్బంది ఫోన్ నెంబర్లను అందించి ఏవైనా సందేహాలున్నా, సమస్యలున్నా ఎప్పుడు ఫోన్‌చేసినా వివరాలు చెబుతామని సూచించారు. తప్పని సరిగా తాము చెప్పిన నిబంధనలు పాటించాలని హెచ్చరించారు. అందరికీ మంత్రి నివాసం వద్దే భోజనం అందజేశారు. ఎనిమిది రోజులపాటు సేవలు అందించిన శంకర్‌నేత్రాలయ ప్రతినిధి అరుళ్‌కుమార్‌ను మున్సిపల్ చైర్మన్, ఎంపీపీ దుస్సాలువలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ భార్గవి, కౌన్సిలర్ బీడీ భాస్కర్, ఆస్పత్రి కమిటీ డైరెక్టర్ కృష్ణమూర్తి, ఎంపీటీసీ యేసు, నాయకులు భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మెరుగైన ఆరోగ్య సేవలకు ప్రభుత్వ కృషి

ప్రజాశక్తి-బంగారుపాళ్యం: అందరికీ ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని తగువారిపల్లి పంచాయతీలో జగనన్న సురక్ష కార్యక్రమం సర్పంచ్ వాణి ప్రియ ఆధ్వర్యంలో జరిగినది. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి, జెడ్పిటిసి సోమశేఖర్, ఎంపీటీసీ హేమచంద్ర, వైద్యులు లోహిత్ చెంగల్ రాయలు, విజయ్ కుమారి, పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-సోమల: మండలంలోని ఆవులపల్లె గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 233 మంది రోగులు హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వైయస్సార్ కంటి వెలుగు ద్వారా పలువురికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు పుష్పకుమారి, సోమేశ్వర రెడ్డి, బాలాజీ పాల్గొన్నారు.

సినిమా థియేటర్ అదరహో



- నగరిలో హైదరాబాద్ తరహా సినిమా హాల్
- అత్యాధునిక హంగులతో ఏర్పాటైన ఎన్ఎంసి సినిమాస్
- బుక్ మై షో ద్వారా టికెట్ బుకింగ్స్
- తొలిగా 'గుంటూరు కారం' సినిమా విడుదల

ప్రజాశక్తి-నగరి: నగరి మున్సిపల్ పరిధిలో చిత్తూరులో జిల్లాలోనే సినీ ప్రేక్షకులను ఆకర్షించేందుకు ఎన్ఎంసి సినిమాస్ థియేటర్లో హైదరాబాద్ తరహాలో ఆధునిక వసతులతో కూడిన డాల్బి ఆటమ్స్ 4కే ఏసీ సిస్టమ్‌ను ఏర్పాటు చేసి ప్రేక్షకులకు కనువిందు చేయడానికి థియేటర్ యాజమాన్యం కృషి చేసింది. ఈ పద్ధతిలో తొలి సినిమాగా మహేష్‌బాబు హీరోగా నటించిన 'గుంటూరు కారం' చిత్రాన్ని విడుదల చేశారు. అందుకు ముందస్తు ప్రణాళికలు ప్రకారం బుకింగ్ కౌంటర్లో కాకుండా ఆన్‌లైన్ పద్ధతిలో 'బుక్ మై షో' యాప్ ద్వారా సినిమా టిక్కెట్లును విక్రయించారు. చిత్తూరు జిల్లా సినిమా థియేటర్ల చరిత్రలోనే తొలిసారిగా నగరిలోని ఎన్ఎంసి థియేటర్లో డాల్బిఆటమ్స్ పద్ధతిలో 4కె స్క్రీన్, ఏసి ఏర్పాటు చేశారు. చిత్తూరు జిల్లాలోనే ఎన్ఎంసి సినిమాస్ స్క్రీన్ పెద్దది కావడం విశేషం. యాజమాని మహేష్ ఆత్యంత ఆకర్షణీయంగా థియేటర్‌ను తీర్చిదిద్దారు. సంక్రాంతి సందర్భంగా శుక్రవారం తొలిసారిగా 'గుంటూరు కారం' సినిమా విడుదల చేశారు. ఈచిత్రానికి ప్రేక్షకుల నుంచి విశేష స్పందన రావడంతో థియేటర్ యాజమాన్యం హర్షం వ్యక్తం చేశారు. అలాగే థియేటర్లోకి ప్రవేశించాలంటే కూడా సెక్యూర్టీ అనుమతి తీసుకునే విధంగా చర్యలు చేపట్టారు. సినీ ప్రేక్షులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సినిమా టిక్కెట్లు కొనుగోలుకు క్యూవద్ద బారులు తీరే పరిస్థితి రాకుండా బుక్ మై షో యాప్ ద్వారా సినిమా టిక్కెట్లు బుక్ చేసుకునే విధానాన్ని కల్పిండంతో ఆటు ప్రేక్షకుల నుంచి కూడా ఈ సినిమా థియేటర్కు విశేష స్పందన లభిస్తోంది.



ఘనంగా సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: స్థానిక రామ్ నగర్ కాలనీలోని హార్వాడ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శుక్రవారం ముందస్తు సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ భాస్కర్ మాట్లాడుతూ తెలుగు సాంప్రదాయాలను నేటి విద్యార్థులు తెలుసుకొని ఆచరించాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు సాంప్రదాయ దుస్తులతో చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

జోసఫ్ రాజుకు ఉత్తమ అవార్డు

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: సపోర్ట్ సంస్థ అధ్యక్షులు జోసఫ్ రాజు ఉత్తమ అవార్డును అందుకున్నారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా నెహ్రూ కేంద్ర ఆధ్వర్యంలో యువజన వారోత్సవాలు చిత్తూరు డిఆర్డిఏ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ యువజన సంఘాలకు స్వచ్ఛంద సంస్థలకు అవార్డులు అందించారు. ఈ నేపథ్యంలో జోసఫ్ రాజు చేస్తున్న సేవా కార్యక్రమాలకు అవార్డును డిఆర్‌డిఏ పిడి తులసి, నెహ్రూ యువ కేంద్ర కోఆర్డినేటర్ ప్రదీప్ కుమార్, గణాంక అధికారి బాబురెడ్డి చేతుల మీదగా అవార్డు అందుకున్నారు. పలువురు జోసప్ రాజును అభినందించారు.

'టీడీపీకి వెన్నుదన్నుగా బీసీలు'

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: రాష్ట్రంలో బీసీ సామాజిక వర్గాలు టీడీపీకి వెన్నెముక లాంటివని జీడీ నెల్లూరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జ్ డాక్టర్ థామస్ అన్నారు. జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షులు శ్రీధర్ యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం జయహో బీసీ కార్యక్రమాన్ని రాణా జంక్షన్ నుంచి బైక్, ఆటోలు ర్యాలీగా వెళ్లి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు రవిప్రకాష్, జ్యోతియాదవ్, రవియాదవ్, శరవణకుమార్, చంగల్రాయ్‌యాదవ్, స్వామిదాస్, కిషన్‌చంద్ తదితరులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: రాజకీయ నాయకుడిగా కాకుండా సేవకుడిగా పనిచేస్తానని టీడీపీ నేత డాక్టర్ థామస్ అన్నారు. శుక్రవారం టీకేయం పురం పంచాయితీ టిఆర్ పురం గ్రామంలో 'మన ఇంటికి మన థామస్' కార్యక్రమంలో ద్వారా పర్యటించారు. అక్కడి పరిస్థితులను చూసి స్పందించి ఆయన మాట్లాడుతూ డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి రెండు పర్యాయాలు ఈ నియోజకవర్గ నుంచి గెలుపొందారని, ఎక్కడి సమస్యలు అక్కడే ఉండిపోయాయని విమర్శించారు. టీడీపీని గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షులు లోకనాథరెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యులు మోహన్ మురళి, నాయకులు చెంగలరాయలరెడ్డి, బి.ఎం రవి తదితరులు పాల్గొన్నారు.

సేవే అభిమతం

- జిజేఎం ఛారిటబుల్ ట్రస్ట్ పేరిట పలు సేవా కార్యక్రమాలు
- పేదల ఆర్థికాభివృద్ధికి చేయూత నిస్తున్న దాత
- పలువురికి ఆదర్శంగా నిలుస్తున్న ట్రస్ట్ అధినేత గురజాల జగన్‌మోహన్

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్: చిత్తూరు నియోజకవర్గంలో పసుపు జెండా రెపరెపలాడిందనా.. దివంగత ఎన్‌టిఆర్, మాజీ ముఖ్యమంత్రి



నిత్యవసర వస్తువుల పంపిణి కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జగన్మోహన్

చంద్రబాబునాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ప్లేక్సీలు, బేనర్లు, పోస్టుర్లు వెలిశాయంటే చిత్తూరు నియోజకవర్గంలో జిజేఎం ట్రస్ట్ అధినేత తెలుగుదేశం నాయకులు గురజాల జగన్మోహన్ తన చారిటుబల్ ట్రస్ట్ ద్వారా నియోజవర్గంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలే గత ఎన్నికల్లో టిడిపి ఓటమి తరువాత చిత్తూరు నియోజవర్గంలో నిస్తేజంగా ఉన్న నేతలు, కార్యకర్తల్లో జగన్మోహన్ కొత్త ఊపును తీసుకొచ్చారు. ఇందులో ఎలాంటి సదేహం లేదు. పార్టీ కార్యక్రమాలు పెరిగాయి. చిత్తూరు జిల్లా గుడిపాల మండల నివాసి అయిన గురజాల చెన్నకేశవనాయుడు తనయుడు గురజాల జగన్మోహన్ పుట్టిపెరిగింది చిత్తూరులోనే రామ్‌నగర్ కాలనీలో నివాసం ఉన్న సమయంలో కింగ్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల్లో విద్యాభాసం సాగింది.

వ్యాపార రిత్య బెంగుళూరుకు వెళ్లారు. రియల్‌ఎస్టేట్ ఇతర వ్యాపారాల్లో రాణించారు. జిజేఎం చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తానే చేసే కార్యాక్రమాల్లో తెలుగుదేశం సింబల్ కనిపిస్తుంది. ఇదే పార్టీపట్ల జగన్మోహన్‌కు ఉన్న నిబద్ధత.. గుడులు, గోపురాలు, మసీదులు, చర్చిలకు విరాళాలు అందించారు. క్రిస్‌మస్ పురస్కరించుకొని చర్చిఫాదర్స్‌కు నూతన వస్త్రాలతో పాటు ఆర్థిక సాయం అందించారు. యువతన క్రీడల్లో పొత్సహించేలా క్రీడా సమాగ్రిని అందిస్తున్నారు. సాయం కోసం తనగడప తొక్కిన వారికి లేదనకుండా సాయం చేయడం గురజాల నైజం. పార్టీ ముఖ్య నేతలతో పాటు ప్రజా సంఘాల నేతలను తాను చేసే సేవా కార్యక్రమాల్లో భాగస్వామం చేస్తున్నారు. వీధుల్లో వ్యాపారం నిర్వహించే చిరు వ్యాపారులకు తోపుడుబండ్లు, పానిపూరి బండ్లు పంపిణీ చేయడంతో పాటు వ్యాపారాన్ని ప్రారంభించేందుకు ఆర్థియ సాయం అందించారు. ఇలా చిత్తూరు నగర పరిధిలో వందకు పైగా తోపుడు బండ్లు, పానీపూరి బండ్లు పేదలకు అందించారు. అక్రమ కేసులో జైల్లో ఉన్న చంద్రబాబు బయటకు రావాలంటూ తొమ్మిది రోజుల పాటు చండీయాగం నిర్వహించారు. దీపావళి సందర్భంగా పేదలకు టపాకాయాలు, స్వీట్స్ పంపిణి చేశారు. చిత్తూరులో నూతనంగా నిర్మిస్తున్న కైలాసదామం అత్యాధునిక బర్నింగ్ యంత్రం కొనుగోలుకు రూ.40లక్షలు విరాళం అందజేశారు. ఇలా ఒక్కటేమిటి చిత్తూరు నియోజవర్గంలో జిజేఎం ట్రస్ట్ ద్వారా జగన్మోహన్ నిర్వహిస్తున్న కార్యక్రమాలు హొర్తెత్తిస్తున్నాయి.

పేదలకు నిత్యవసరాలు పంపిణీ

తెలుగువారి పెద్ద పండుగను పురస్కరించుకొని నియోజవర్గం ప్రజలకు జిజేఎం చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నిత్యవసరాలు అందించారు. శుక్రవారం నిత్యవసరాల పంపిణి వాహనాలను జగన్మోహన్ ప్రారంభించారు. నగరంలోని ప్రతి వార్డులోని పేదలు సంక్రాంతి పండుగ సంతోషాలతో జరుపుకొనేలా తన సాయంగా నిత్యవసర వస్తులు పంపిణి చేస్తున్నట్లు నిడబంరంగా ప్రకటించారు. తెలుగుదేశం కార్యకర్తలు, జిజేఎం అభిమానులు శుక్రవారం నుండీ చిత్తూరు కార్పొరేషన్ పరిధిలో వార్డుల వారిగా నిత్యవసర వస్తులు పంపిణీకి శ్రీకారం చుట్టారు. పార్టీ అభివృద్ధి కోసం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు పార్టీ విజయం కోసం పని చేస్తున్నానని ఎంఎల్ఏ టికెట్ ఎవ్వరికి ఇచ్చినా పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు విజయం కోసం సాయశక్తులు పని చేస్తానని గురజాల జగన్మోహన్ (జిజేఎం) జనంలో తనకంటు ఓ గుర్తింపు తెచ్చుకున్నారు. రాష్ట్రం బాగుపడాలంటే అన్ని వర్గాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలంటే రాష్ట్రంలో తెలుగుదేశం అధికారంలోకి వచ్చి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలనే తన ఆంక్ష అంటూ అందుకొసమే పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెబుతున్నారు గురజాల జగన్మోహన్.



జిజేఎం ట్రస్ట్‌చే పేదలకు తొపుడు బండ్లు పంపిణీ



గురజాల జగన్మోహన్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
రహదారులు మరియు భవనముల శాఖ
'e' ప్రొక్యూర్మెంట్ షార్ట్ టెండర్ నోటీసు నిట్ నెంబర్. 117/ఇఇ(ర.భ.) చిత్తూర్/టి.ఓ/2023-24, తేది: 12-01-2024

చిత్తూరు (ర.భ) డివిజన్ పరిధిలోని (1) పనికి గాను సుమారు రూ.10.00 లక్షల/- అంచనాతో 2023 సంవత్సరమునకు గాను, 'e' ప్రొక్యూర్మెంట్ ప్లాట్ ఫారం క్రింద ఆన్‌లైన్ టెండర్లు ఆహ్వానించడమైనది. టెండరుదార్లు తమ టెండర్లను తేదీలు : 12.01.2024 మధ్యాహ్నం 3.00 గంటల నుండి 19.01.2024 గం॥ 3.30 ని॥ వరకు దాఖలు చేయవచ్చును. తదుపరి వివరములకు, ఈ కార్యాలయము పని వేళలయందు పొందవచ్చును. మార్పులు, చేర్పులు మరియు రద్దు చేయు అధికారము కార్యనిర్వాహక ఇంజినీరు వారికి కలదు.

సం/- కార్యనిర్వాహక ఇంజినీరు,
(ర.భ.) విభాగము, చిత్తూరు.